క్లుప్తంగా

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం


విరాళం అందజేస్తున్న భక్తుడు జగ్గప్పారావు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా దిబ్బపాలెంకు చెందిన రామలక్ష్మణ ఇటుకబట్టీ యజమాని పెంటకోట జగ్గప్పారావు, సత్యవతి దంపతులు రూ.20 వేలను శనివారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు


పిల్లల కూచిపూడి నృత్య ప్రదర్శన

మునగపాక: కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక నందీశ్వర కళా ప్రాంగణంలో గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మునగపాకకు చెందిన ఐ కిడ్స్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్య భంగిమలు అలవోకగా ప్రదర్శించారు. ఇవి చూపరులను అలరించాయి. ఐ కిడ్స్ నిర్వాహకులు జగదీష్, కిరణ్‌లను పలువురు అభినందించారు.

మునగపాకలో వాహన తనిఖీలు


మునగపాకలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక: ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఏఎస్‌ఐ దొర కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహన దారులు తప్పనిసరిగా తమ వెంట రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా ఎక్కువ మంది ప్రయాణికులతో ఆటో నడిపినా జరిమానా తప్పదని హెచ్చరించారు.



- పూడిమడక రోడ్డులో దూసుకొస్తున్న వైనం
- పగటిపూటా రాకపోకలు
- తరచూ ప్రమాదాలు
- వాహన దారుల ఆందోళన


అచ్యుతాపురం వైపునకు వెళ్తున్న భారీ వాహనం

భారీ వాహనాలతో భయం భయం

మునగపాక: పూడిమడక రోడ్డులో ప్రయాణమంటే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ మార్గంలో నిత్యం రేయింబవళ్లు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీనికి తోడు ఇవి పరిమితికి మించి అధికలోడుతో వెళ్లడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని కలవరపడుతున్నారు. అసలే ప్రస్తుతం ఉన్న రహదారి ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

పరిమితికి మించి అధికలోడులతో..

పూడిమడక రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పరిమితికి మించి అధిక లోడులతో వాహనాలు రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉంటున్నాయి. రహదారి కెపాసిటీకి మించి తమను ఎవరూ ఏం చేయలేరన్న ధైర్యంతో లారీ డ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలను తిప్పుతున్నారు. అధిక ట్రిప్పులు వేయడం ద్వారా ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయన్న ఆశతో డ్రైవర్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల ఆదేశాలు బేఖాతరు...

తరచూ పూడిమడక రోడ్డులో ప్రమాదాలు జరగడంతో పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు జిల్లా కలెక్టర్‌తోపాటు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయింది. పూడిమడక రోడ్డులో రాత్రిళ్లు భారీ వాహనాలు రాకపోకలు సాగించాలంటూ పోలీసు ఉన్నతాధికారులు గతంలో ఆదేశించారు. ఇవేమీ తమకు పట్టనట్లు రేయింబవళ్లు అనే తేడా లేకుండా భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. పగటి పూట భారీ వాహనాలు తిప్పితే జరిమానాలతో పాటు చర్యలు తీవ్రంగా ఉంటాయంటూ హెచ్చరికలు జారీ చేసినా డ్రైవర్లు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అసలే ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు...

అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు రోడ్డు ప్రస్తుతం ఇరుకుగా ఉంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే భారీ వాహనాల కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు తప్పడం లేదు. రోడ్డును విస్తరించడం ద్వారా ప్రమాదాలను అరికట్టడం సాధ్యమవుతుంది. విస్తరణ పనులు కూడా అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. దీంతో భారీ వాహనాల రాకపోకలు మాత్రం ఆగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పగటి పూట భారీ వాహనాలను నిషేధించాల్సిన అవసరం లేకపోలేదు.

నిబంధనలు అతిక్రమించే వారిపై కేసులు



పూడిమడక రోడ్డులో రాత్రిళ్లు మాత్రమే భారీ వాహనాలకు అనుమతి ఇచ్చాం. పగటిపూట వాహనాలను నడపరాదంటూ భారీ వాహన డ్రైవర్లకు పలుమార్లు హెచ్చరించాం. నిబంధనలు అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు రాత్రి పూట జనసంచారం లేని సమయంలో భారీ వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

– పి.ప్రసాదరావు, ఎస్‌ఐ, మునగపాక

కూటమి పాలనలో పథకాల కోత

- నమ్మించి మోసగించడం చంద్రబాబుకు అలవాటే
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ


షేకిళ్లపాలెంలో కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తున్న కరణం ధర్మశ్రీ


తురంగలపాలెంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమానికి హాజరైన మహిళలు

యలమంచిలి రూరల్: సీఎం చంద్రబాబు ఏనాడూ అధికారంలో ఉన్నా పథకాల్లో కోతలు తప్పకుండా ఉంటాయని, ప్రజలకు వాతలు లేకుండా ఆయన ఒక్క కార్యక్రమం సాగదని మాజీ ఎమ్మెల్యే, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా వంచనకు గురి చేసిందన్నారు. శనివారం యలమంచిలి మండలం జంపపాలెం, తురంగలపాలెం, షేకిళ్లపాలెం గ్రామాల్లో రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పేదలందరికీ నవరత్నాల పథకాలు అమలు చేశామన్నారు. ఏయే పథకాలు అమలు చేశామో ఆ వివరాలు సచివాలయాల్లో ఉంచామని చెప్పారు. ఇంత కన్నా మెరుగైన సంక్షేమం అందిస్తామని చెప్పిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక ఎప్పటిలాగే పూర్తిగా అమలు చేయకుండా మోసగించారన్నారు.

కూటమి కుతంత్రాలకు బుద్ధి చెప్పండి

ఎన్నికల ముందు 143 హామీలిచ్చిన చంద్రబాబు, కూటమి నాయకులు ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని పథకాలు ఎగ్గొట్టారని ధర్మశ్రీ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారుగా, మీలో ఎంతమందికి అందాయని మహిళలను అడగ్గా.. వారంతా మాకెవరికీ అందలేదని బదులిచ్చారు. తల్లికి వందనం పథకం డబ్బులు ఒక్కొక్కరికి ఒక్కోలా పడ్డాయన్నారు. ఈ పథకం కింద మొదట్లో రూ.15 వేలు ఇస్తామన్నారని, ఇప్పుడు రూ.13 వేలు ఇస్తున్నారన్నారు. ఇవి కూడా ఒకరికి రూ.13 వేలు, మరొకరికి రూ.10వేలు, ఇంకొకరికి రూ.9 వేలు అందాయన్నారు. చాలా మంది అర్హులకు డబ్బులు పడలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని పూర్తిగా నీరుగార్చారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతుకు రైతు భరోసా కింద రూ.13,500 వ్యవసాయ సీజన్లకు ముందే ఇచ్చామన్నారు. సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఏడాది తర్వాత తొలి విడతగా రూ.5 వేలు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. అది కూడా కొంతమందికేనన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, లేకుంటే ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం ఆగదన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి కుతంత్రాలు, కక్షపూరిత పాలనకు చరమగీతం పాడడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దూది నర్సింహమూర్తి, ఉప్పులూరి కిరణ్, జంపపాలెం నాయకులు యల్లపు శ్రీరాములు, ఆళ్ల సత్య సోమునాయుడు, యల్లపు ఉమామహేశ్వరావు, కర్రి త్రినాథ్, తురంగలపాలెం నాయకులు చందక శంకర్రావు, భీముని రమణాజీ, గొర్లె రమణ, షేకిళ్లపాలెం నాయకులు తోకల రాజు, మరిసా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందమయ జీవితానికి భగవద్గీత


భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్న పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని వెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు కోరారు. మండలంలోని పల్లపు ఆనందపురం సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి భగవద్గీతపై అవగాహన కల్పించారు. ఆనందమయ జీవితానికి భగవద్గీత ఆధారమన్నారు. భక్తి భావాలను పెంపొందించుకోవాలన్నారు. దైవ దర్శనాల ద్వారా మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో అల్లవరపు రమణబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను అందజేశారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి


వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నక్కపల్లి: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని శనివారం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు పోలినాటి నానాజీ, పీఏసీఎస్ డైరెక్టర్ కోసూరు శ్రీను స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందన్నారు. దేశంలో లక్షలాది కోట్లు వెచ్చించి ప్రధాన రహదారులను నిర్మించారన్నారు. కోలకత్తా–చెన్నై హైవే ని నాలుగు లైన్లుగా విస్తరించారన్నారు. పార్టీ నాయకులు రవిరాజు, కే శివప్రకాష్ ఈగల వెంకటేశ్వరరావు, నున్న రాముడు, ఉప్పల రాజు, జీ రాజు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో పంచాయతీ రోడ్లు ఛిద్రం


భారీ వాహనాలతో పూర్తిగా పాడైపోతున్న పంచాయతీ దారులు

అచ్యుతాపురం రూరల్: పరిశ్రమల నుంచి వచ్చే భారీ వాహనాల వల్ల స్థానిక పంచాయతీ రోడ్లు దారుణంగా దెబ్బతింటున్నాయి. దేవాలయాలు, గ్రంథాలయం, పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే సామాన్య ప్రజల కోసం వేసిన దారిలో భారీ వాహనాలు రాకపోకలు చేస్తుండటంతో గోతులమయమైంది. పాడైన పంచాయతీ దారుల్ని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలకు రూ.లక్ష ఫర్నిచర్ వితరణ


ఉపాధ్యాయులకు ఫర్నిచర్‌కు సంబంధించి ధ్రువ పత్రం అందజేస్తున్న పీలా సందీప్ కుటుంబీకులు


పాఠశాలలకు అందజేసిన ఉపకరణాలు

అచ్యుతాపురం రూరల్: ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఉపయోగపడే కుర్చీలు, బల్లలు, అల్మారా, అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లను ఎంపీటీసీ పీలా ధనలక్ష్మినాయుడు వితరణగా అందజేశారు. వీటిని లక్ష రూపాయలు వెచ్చించి సమకూర్చడటంతో ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పీలా తులసీరామ్, పీలా సందీప్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: మండలంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. పెదగుమ్ములూరు, ఎస్.రాయవరం, చినగుమ్ములూరు ఫీడర్ల పరిధి గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు, పెట్టుగోళ్లపల్లి, నీలాద్రిపురం, రామయ్యపట్నం, పెదరామకృష్ణాపురం, పెదబోదిగళ్లం, సీతమ్మపాలెం, దొడ్డుగళ్లు, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో ఈ అసౌకర్యం ఉంటుందన్నారు.

వేడుకగా కృష్ణాష్టమి


కోటవురట్లలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద గోపికల వేషధారణలో చిన్నారులు


అచ్యుతాపురంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ


చినదొడ్డిగల్లులో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


గవర్ల అనకాపల్లిలో కృష్ణుని విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు


రామచంద్రపాలెంలో శ్రీకృష్ణుని దర్శించుకున్న ఎంపీటీసీ రాంబాబు, భక్తులు


రాజుపేటలో అన్న సమారాధనలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

నక్కపల్లి: గోకులాష్టమి(కృష్ణాష్టమి) పర్వదినాన్ని శనివారం వాడ వాడలా ఘనంగా జరపుకున్నారు. పలు గ్రామాల్లో శ్రీకృష్ణుడి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవవరం, చినదొడ్డిగల్లు, గొడిచర్ల, జానకయ్యపేట, ఉపమాక, ఉద్దండపురం, రాజయ్యపేట, బోయపాడు, వేంపాడు, తదితర గ్రామాల్లో కృష్ణుడి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కృష్ణుడి విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అన్న సమారాధన, ప్రత్యేక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉపమాక వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారిని నూతన వస్త్రాలతో అలంకరించి గోకులాష్టమి వేడుకలు నిర్వహించారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ధర్మశ్రీ

అచ్యుతాపురం రూరల్: స్థానిక శ్రీకృష్ణుని ఆలయంలో వేకువజాము నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసారు. వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ మానవ మనుగడకు భగవద్గీత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, వైస్ ఎంపీపీ వాసువల్లి పద్మశ్రీనివాస్, సర్పంచ్‌లు కూండ్రపు విమలానాయుడు, పంచదార్ల పైడిరాజు, రాజాన నాయుడుబాబు, కూండ్రపు సత్యారావు, గొర్లి అశ్విని నూకరాజు, ఎంపీటీసీ ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి బాబ్జి, పల్లి శేషగిరిరావు, బలిరెడ్డి శ్రీను, ధర్మిరెడ్డి నాయుడుబాబు, పంచదార్ల రవి, శెట్టి నాగేశ్వర్రావు, గంగూలి శ్రీను, మాడెం సూరి అప్పారావు, కిల్లాడి కృష్ణ పాల్గొన్నారు.

మునగపాక: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. గవర్ల అనకాపల్లిలో ఆళ్ల వెంకటరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగపాక బీసీ కాలనీ యువకులు శ్రీకృష్ణుని విగ్రహాన్ని కేరింతలు కొడుతూ నృత్యం చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మునగపాక సంతబయిల శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. రాజుపేటలో నిర్వహించిన అన్న సమారాధనలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారితోపాటు కూటమి నేతలు కర్రి సాయి కృష్ణ, పెంటకోట విజయ్ పాల్గొన్నారు. తిమ్మరాజుపేటలో బాల వికాస్ పిల్లలతో ఉట్టు కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

కోటవురట్ల: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు చేశారు. కోటవురట్లలోని సినిమాహాలు రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో భక్తులు తుమ్మలపల్లి ఆంజనేయులు, పుత్రరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు గోపికాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. రామచంద్రపాలెం ఆలయంలో ఎంపీటీసీ పెట్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కన్నబాబు, బుజ్జి పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: మండలం, పట్టణ వ్యాప్తంగా భక్తులతో కృష్ణ మందిరాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలతో అలరించారు. చిన్నారుల అలంకరణ చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. యలమంచిలి సన్యాసమ్మ చెరువు పక్కనున్న శ్రీకృష్ణుని ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కాకివానివీధి గోవిందుని ఆలయంలో స్వామిని పూలు, తులసి ఆకులతో అలంకరించారు. రుక్మిణీపురంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఎంపీపీ బొదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, పార్టీ నాయకులు సేనాపతి రాము, దూది నర్సింహమూర్తి, సర్పంచ్ కరణం సత్తిబాబు(పండు), ఉప సర్పంచ్ సీహెచ్ ప్రసాద్, లాలం లోవరాజు, కరణం తాతలు, దొడ్డి రామకృష్ణ, కాళ్ల గణేష్, సతీష్ పాల్గొన్నారు. రాత్రి యలమంచిలి పట్టణం కాకివాని వీధిలో ఉట్లోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా పలు గ్రామాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు.

ఎస్.రాయవరం: మండలంలో పెట్టుగోళ్లపల్లి, కోనవానిపాలెం, కొత్త పోలవరం, పెనుగొల్లు, రామయ్యపట్నం తదితర గ్రామాల్లో కృష్ణుని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనవానిపాలెంలో అయిదురోజులు వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

పాయకరావుపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వాడవాడలా శనివారం ఘనంగా జరిగాయి. శ్రీప్రకాష్ విద్యా సంస్థలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించారు. అనంతరం ఉట్టి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టారు. విద్యార్థులు కృష్ణ శతక పద్యాలు పఠించి, కృష్ణుని జననం, లీలలను నృత్యా గానాలతో ప్రదర్శించి, ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మునగపాకలో కృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న యువకులు


దేవవరంలో ఉట్టికొడుతున్న దృశ్యం


యలమంచిలి మండలం రుక్మిణీపురంలో కృష్ణాష్టమి వేడుకల్లో సమన్వయకర్త కరణం ధర్మశ్రీ


యలమంచిలి పట్టణం ప్రధాన రహదారి పక్కనున్న కృష్ణుని ఆలయంలో భక్తుల పూజలు


శ్రీప్రకాష్‌లో శ్రీకృష్ణుడికి ఊంజల సేవ చేస్తున్న చిన్నారులు